క్లుప్తంగా

రైతు గుర్తింపు సంఖ్యపై సదస్సు



రైతుల వివరాల నమోదును పరిశీలిస్తున్న డీఏవో మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన రైతు గుర్తింపు సంఖ్యపై బుధవారం రాజవోలులో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో మాధవరావు మాట్లాడుతూ దగ్గరలోని రైతు సేవాకేంద్రానికి వెళ్లి రైతులు ఈ నంబర్‌ను పొందవచ్చన్నారు. ఆధార్‌కు లింకైన ఫోన్ నంబర్‌కు వచ్చిన ఓటీపీ ద్వారా రైతులు నమోదు చేసుకోవచ్చన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

కడియం: కడియపులంక సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఆ సమయంలో కడియపులంక, బుర్రిలంక, వెంకాయమ్మపేట, పొట్టిలంక గ్రామాల్లోని వ్యవసాయ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

మహనీయుల సేవలు చిరస్మరణీయం

ప్రకాశం నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిన జీఎస్ బాలాజీ దాస్, బీబీ నాయుడు చిరస్మరణీయులని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. బాలాజీ దాస్ 22వ వర్ధంతి, బీబీ నాయుడు 8వ వర్ధంతి సభను బుధవారం స్థానిక బీటీకే భవన్‌లో నిర్వహించారు. తొలుత చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అరుణ్ మాట్లాడుతూ జీఎస్ బాలాజీ దాస్ విద్యార్థిగా ఉండగానే బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తన ఉద్యమ ప్రస్థానం ప్రారంభించారని గుర్తు చేశారు. బీబీ నాయుడు పేపరు మిల్లులో సాధారణ కార్మికుడిగా జీవిత ప్రస్తానం ప్రారంభించి సీఐటీయూ రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎన్నిక య్యారన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పరిశ్రమలలో పనిచేసే కార్మికుల పోరాటాలకు దిశానిర్దేశం చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.పవన్, టి.తులసి, తాతారావు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

ప్రకాశం నగర్: ప్రతి రైతు కుటుంబానికి పెట్టుబడి సాయం కింద రూ.20 వేలను ప్రభుత్వం తక్షణమే అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక అంబల సూర్యనారాయణ భవనంలో సంఘ అధ్యక్షుడు పంతం నాగేశ్వరావు అధ్యక్షతన బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్‌లో భాగంగా పెట్టుబడి సాయం అందజేస్తామని ఇచ్చిన హామీని.. ఇప్పటికీ అమలు చేయకపోవడం సరికాదన్నారు. 2025 – 26 రాష్ట్ర బడ్జెట్ లో వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కడపలో ఈ నెల 22, 23 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ కౌలు రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేయాలన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేపూడి జ్యోతిరాజు, నాయకుడు తోట లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించినట్టు బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపారు. ఆ ప్రాంతంలోని ఓ డాబాలో పని చేసే సర్వర్ వద్ద, మరో సంఘటనలో లారీ డ్రైవర్‌పై దాడిచేసి సెల్‌ఫోన్లు, నగదు చోరీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కేసు నమోదు చేసి ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా మంగళవారం రాత్రి జీరో పాయింట్ వద్ద రాజమహేంద్రవరం రంగ్రీజుపేటకు చెందిన పొడుగు గణేష్, అన్నపూర్ణమ్మపేటకు చెందిన సీతా దుర్గాప్రసాద్, మరో బాలుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. డాబాలోని సర్వర్, లారీ డ్రైవర్‌పై దాడిచేసి సెల్‌ఫోన్లు , నగదు చోరీ చేసింది వీరేనని విచారణలో తేలింది. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పొడుగు గణేష్, సీతాదుర్గాప్రసాద్‌ను బుధవారం రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు.

పుంగనూరు ఆవు చోరీ

రాజమహేంద్రవరం రూరల్: తమ గోశాలలోని పుంగనూరు ఆవును కొద్దిరోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని బుచ్చయ్య నగర్‌కు చెందిన కోరుపల్లి వెంకటరావు బుధవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని విలువ రూ.లక్ష ఉంటుందని తెలిపారు. ఈ మేరకు ఎస్సై కనకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళావిహీనం

- అధ్వానంగా ఆలయ నృత్యవనం
- పేరుకుపోయిన చెత్త
- గతమెంతో వైభవం
- పట్టించుకోని సిబ్బంది

సీటీఆర్ఐ: భారతీయ నాట్యంలోని ఎన్నో విశేషాలను తెలియచేసే శిల్పాలు, నాట్యచరిత్ర పరిణామ క్రమాన్ని చాటిచెప్పే కళాకృతులు, ఇలా అపూర్వ శిల్ప సంపద సమాహారం రాజమహేంద్రవరంలోని ఆలయ నృత్య కళావనం. అంతరించిపోతున్న ఆలయ నృత్యానికి ప్రాచీన వైభవాన్ని తీసుకొచ్చేందుకు ప్రముఖ నాట్యాచార్యుడు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద 2008లో దీన్ని నిర్మించారు.

ఎన్నో ప్రత్యేకతలు

ఎన్నో ప్రత్యేకతలున్న ఈ ఆలయ నృత్యవనం నేడు కళావిహీనంగా మారుతోంది. ఈ ఆలయ వనాన్ని కార్పొరేషన్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నప్పటికీ ఆదాయం రాని కారణంగా శ్రద్ధ చూపడం లేదు. వనం అంటే చిన్న చిన్న మొక్కలు ఉండాలి. కానీ ఇందులో ప్రారంభంలో నాటిన మొక్కలు నేడు పెద్ద వృక్షాలుగా పెరిగిపోయి ఆలయ నృత్య వనంలో శిల్పాలు కనిపించడం లేదు. అంతేకాకుండా ఇక్కడ చెట్ల నుంచి వచ్చిన చెత్త, ఆకులు శుభ్రం చేయడం మానేశారు. ఆ చెట్ల నుంచి కొమ్మలు విరిగి శిల్పాలపై పడి ధ్వంసం అవుతున్నాయి. ఈ మధ్య వీచిన గాలికి ఓ చెట్టు కొమ్మ విరిగి నర్తన శిల్పం ధ్వంసమైంది.

నర్తనయజ్ఞ దిగ్విజయ స్థూపం

ప్రపంచ చాట్య కళాచరిత్రలో 106, 118, 136 మంది కళాకారులతో మూడు నర్తన యజ్ఞాలు విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా



వనంలో ధ్వంసమైన శిల్పం

సప్పా దుర్గాప్రసాద్ కళావనం మధ్యలో 41 అడుగుల సకల శిల్పాలంకార స్థూపాన్ని నిర్మించారు. ఆది దేవుడైన వినాయకుడు, శంకచక్రదారి శ్రీమహావిష్ణువు, ఆలయ నర్తకీమణులు, నటరాజు వంటి అపూర్వ శిల్పసంపదతో కనువిందు చేయడమే కాకుండా, భారతీయ నాట్యంలోని ఎన్నో విశేషాలను ఇక్కడి శిల్పాలు మనకు తెలియ చేస్తాయి.

కాకతీయ వీరశైవ నాట్యం

13వ శతాబ్దానికి చెందిన కాకతీయుల కాలం నాటి తెలువీరుల తాండవ విన్యాసాలను ఈ శిల్పంలో చూడవచ్చు. కాకతీయుల కాలంలో యుద్ధానికి వెళ్లే



కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని ఆలయ నృత్యకళావనం

సైనికులకు ప్రేరణగా ఈ నాట్యం ప్రదర్శించేవారు. తర్వాత కాలంలో పేరిణి శివతాండవంగా ఈ నాట్యం పునఃసృష్టి చెందింది.

శైవాగమ నర్తన స్థూపం

ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ నృత్యాలు రెండు రకాలు. నాట్యదేవుడైన నటరాజును ఆరాధిస్తూ నర్తించే శైవాగమ నృత్యానికి ప్రతీకగా ఏర్పాటు చేసిన శైవాగమ నర్తన శిల్పాలను ఇక్కడ చూడవచ్చు.

ఆలయ నృత్యం

ఆలయాల్లో దేవునికి చేసే షోడశోపచార పూజల్లో ఆలయ నృత్యానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. ఆలయాల్లో ఉదయం సుప్రభాత సేవ నుంచి పవళింపు సేవ వరకూ చేసే సేవలలో ఆలయ నృత్యం తప్పనిసర అని ఆగమశాస్త్రం చెబుతోంది.

యజనర్తనం

యజ్ఞయాగాది క్రతువుల్లో ఈ నృత్యకళ తప్పనిసరిని ఆగమశాస్త్రం చేబుతోంది. ఈ నృత్యం లేని యజ్ఞ యగానికి పూర్తి ఫలితం రాబోదని ఈ శిల్పాలపై పేర్కొన్నారు.

వైష్ణనాగమనృత్యం

శ్రీహరి అభినయ ప్రియుడు. ఆయనను ఆరాధిస్తూ చేసేది వైష్ణనాగమనృత్యమని ఈ శిల్పంపై తెలియజేశారు.

విష్ణు ప్రియ నర్తన

15 శతాబ్దానికి చెందిన అస్థాన నర్తకి ముద్దుకుప్పాయి మూడు తరాలుగా ఆలయనృత్యానికి అంకితమైన కుటుంబానికి చెందిన కళాకారిణి. అస్థాన నర్తకి సేవను వదులుకుని తిరుమల వేంకటేశ్వరస్వామి సేవకు తన జీవితాన్ని అంకితం చేసింది. ఆమె జీవిత చరిత్రను ఇక్కడ శిల్పంపై చూడవచ్చు. ఇవే కాక మహాసర్పం పడగ నీడన సిద్ధి వినాయకుడు, ఆయనకు తోడుగా కమలోద్భవ శ్రీలింగమూర్తులు శిల్పాలను కూడా ఇక్కడ కనిపిస్తాయి.

అందరికీ తెలియాలనే..



ఆలయ నృత్యం గురించి నేటి తరానికి తెలియజేయాలనే ఈ ఆలయ నృత్య వనాన్ని నిర్మించడం జరిగింది. అయితే సందర్శకులకు అనువుగా ఉండే సమయానికి ఈ వనాన్ని మూసివేస్తున్నారు. ఉదయం 9 గంటలకు ఈ వనాన్ని మూసివేసి తిరిగి మధ్యాహ్నం మూడు గంటల నుంచి 4 గంటల వరకూ తెరిచి ఉంచుతున్నారు. దీనితో సందర్శకులు దీనిలో శిల్పాలను చూడలేకపోతున్నారు. అంతే కాకుండా ఇక్కడ రాత్రి సమయంలో చూడడానికి వీలుగా లైట్లు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్, నర్తన రుషి

బాల్యంలోనే జ్ఞాన బీజాలు నాటాలి

కడియం: బాల్యంలోనే జ్ఞానబీజాలు నాటాలని సర్వశిక్ష ఏఎంవో గౌరీ శంకర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు రోజుల పాటు జరగనున్న జ్ఞాన జ్యోతి (ఈసీసీఈ–ఎఫ్ఎల్ఎన్) శిక్షణ తరగతులను డైట్ లెక్చరర్ డీవీవీ సత్యనారాయణతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. కడియం మండలానికి 83 మంది అంగన్‌వాడీ టీచర్లు ఈ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్నారని ఎంఈవోలు మణికుమార్, నాగేశ్వరరావు వివరించారు. అలాగే స్కూలు హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన హిందీ భాషా దినోత్సవంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. హిందీ టీచర్లు వై.వీర రాఘవ కుమారి, టి.స



కడియంలో మాట్లాడుతున్న గౌరీ శంకర్

త్యకళ్యాణి, కె.భారతి పలు కార్యక్రమాలను ప్రదర్శింపజేశారు. స్టాఫ్ కార్యదర్శి జి.సత్యనారాయణ, జ్ఞానజ్యోతి ఆర్‌పీలు సూర్యనారాయణమ్మ, ప్రసాద్, మూర్తి, సీఆర్పీలు పాల్గొన్నారు.

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

రాజమహేంద్రవరం సిటీ: మహాశివరాత్రిని పురస్కరించుకుని గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా రానున్న నేపథ్యంలో నగరంలోని రేవులతో పాటు రహదారులు, కూడళ్లను పరిశుభ్రంగా ఉంచాలని అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని ఈట్ స్ట్రీట్, జీఎస్‌టీ రోడ్డు, కోటిలింగాలరేవు, చింతాలమ్మ రేవు, కృష్ణ చైతన్య రేవులను బుధవారం ఆయన పరిశీలించారు. కోటిలింగాల రేవు నుంచి చింతాలమ్మ రేవు వరకు నదిలో చెత్త తేలియాడుతుండటంతో సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను 24 గంటలలో మొత్తం చెత్తను తీసివేసి రేవులను శుభ్రం చేయాలని ఆదేశించారు. రేవులలో మెట్లను కూడా శుభ్రంగా



రేవులను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

ఉంచాలని, ఎక్కడికక్కడ డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలన్నారు. నల్లా చానల్ పంపింగ్ స్టేషన్‌ను సందర్శించారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన శిక్షలు

రంగంపేట: బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన శిక్షలకు గురికాక తప్పదని మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాది మడికి రాంబాబు అన్నారు. ఆయన బుధవారం మాట్లాడుతూ సుప్రీం కోర్టు నల్సా వారి ఆదేశాల మేరకు పెద్దాపురం కోర్టు 7వ జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.చంద్రమౌళేశ్వరి ఆదేశాల మేరకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, దివ్యాంగుల యోగక్షేమాలపై ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామన్నారు. దీనికోసం న్యాయశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, అంగన్‌వాడీ, ఆశ, ఏఎన్ఎం, వైద్యాధికారులు తదితర 14 మంది సభ్యులతో టీమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా బుధవారం ఈ టీమ్ సభ్యులు మండల పరిధిలోని చంద్రేడు, బాలవరం గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించారు. దివ్యాంగుల యోగక్షేమాలు, వారికి లభిస్తున్న వైద్యం



పెదరాయవరంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న అధికారుల బృందం

, ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు, సదరన్ సర్టిఫికెట్లు వచ్చాయా, లేదా అని తెలుసుకున్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, శిక్షలు గురించి ఇంటింటికీ తిరిగి తెలియజేయడమే కాకుండా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రమాదాల నియంత్రణలో యువతే కీలకం

రాజానగరం: రోడ్డు ప్రమాదాల నియంత్రణలో యువత కీలక పాత్ర పోషించాలని ఏఎస్పీ ఎన్‌బీకే మురళీకృష్ణ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో బుధవారం 'రోడ్డు భద్రత – కౌమార దశలో క్యాన్సర్' పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం అంటే ఒకరితో పోదని, కుటుంబాలే నష్టపోతాయన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటించాలన్నారు. జిల్లాలో 2022లో 313 మంది, 2023లో 349 మంది, 2024లో 243 మంది రోడ్డు ప్రమాదాలలో చనిపోయారన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో క్షతగాత్రులను సకాలం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ మురళీకృష్ణ

లో ఆస్పత్రులకు చేర్చి, ప్రాణాలు కాపాడిన వారికి ప్రభుత్వం రూ.ఐదు వేలు ప్రోత్సాహకం అందజేస్తోందన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలపై అవగాహన లేకుండా, అతి వేగంగా వాహనాలను నడపడమే ప్రమాదాలకు ప్రధాన కారణమన్నారు. అంకాలజిస్టు డాక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ఆరోగ్యాన్ని అందించే ఆహారం కూడా రెడీమేడ్ అవ్వడంతో క్యాన్సర్ కేసులు పెరిగిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.విద్య, డీన్ డాక్టర్ ఎన్.ఉదయ్ భాస్కర్, ప్రిన్సిపాళ్లు ఆచార్య డి.జ్యోతిర్మయి, డాక్టర్ పి.విజయ నిర్మల, డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, సీఐ వీరయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తు.. యువత చిత్తు

- విచ్చలవిడిగా పెరిగిన వినియోగం
- విద్యాసంస్థలకూ పాకిన మహమ్మారి
- తరలిస్తూ పట్టుబడుతున్న యువకులు

మధురపూడి: సమాజాభివృద్ధిలో యువత పాత్ర చాలా కీలకం. దేశ ప్రగతిలో ముఖ్య భూమిక పోషించాల్సింది కూడా వీరే. అయితే ఆధునిక యువత మత్తు పదార్థాలకు బానిస కావడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా గంజాయి తాగుతూ భవిష్యత్తును నాశనం చేసుకుంటోంది. ఇటీవల వెలుగులోకి వస్తున్న అనేక ఘటనలు దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. కొందరు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి విద్యా సంస్థల్లో వినియోగిస్తున్నారు. దీనికి అలవాటు పడిన యువత అనారోగ్యం పాలవుతున్నారు.

పెద్దల అండదండలు

కూటమి ప్రభుత్వంలోని పెద్దల అండదండలతో గంజాయి రవాణా యథేచ్ఛగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రహదారులు, మారుమూల ప్రాంతాలన్నింటినీ రవాణకు అనుకూలంగా చేసుకుంటున్నారు. ప్రభుత్వ అలసత్వం కారణంగా విద్యాసంస్థలో సైతం గంజాయిని వినియోగిస్తున్నారని సమాచారం.

నియోజకవర్గంలో..

మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో అటవీ ప్రాంతం మీదుగా గంజాయి రవాణా అవుతోంది. జాతీయ రహదారులు ఉండటంతో రవాణాకు అనుకూలమైంది. ఈ మార్గాల మీదుగా పెద్ద పట్నాలు, మహానగరాలకు ఎగుమతి చేస్తున్నారు. ఒడిశా నుంచి విశాఖ జిల్లా



ఇటీవల ఐదుగురు యువకులు గంజాయితో పట్టుబడిన కోరుకొండ మండలం అయ్యన్నగళ్లు సమీపంలోని ఈ రోమ్ సిటీ ప్రాంతం



గంజాయి రవాణాకు అనుకూలంగా మారిన జంబూపట్నం రోడ్డు

అటవీ ప్రాంతం మీదుగా గంజాయి రవాణా జరుగుతోంది. వీటికి సమీపంలోనే రోడ్డు, రైలు మార్గాలుండటంతో వాటి ద్వారా సుదూర ప్రాంతాలకు గంజాయిని తరలిస్తున్నారు.

దారులివే..

గంజాయిని తరలించడానికి స్మగర్లు కొన్ని రోడ్డు మార్గాలను ఎంపిక చేసుకుంటున్నారు. పోలీసులు, చెక్ పోస్టులను తప్పించుకుంటూ, ఆ రహదారుల మీదుగా శరవేగంగా తరలిస్తున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ నుంచి జగ్గంపేట మండలం మల్లిసాల మీదుగా వయా గోకవరం మండలం తిరుమలాయపాలెం, కోరుకొండ మండలం కణుపూరు మీదుగా గాదరాడ, రాజానగరం మండలం సీతారామపురానికి చేరుకుని, అక్కడి నుంచి జాతీయ రహదారి పైకి ఎక్కుతున్నారు. అలాగే ఇదే రూటులో కోరుకొండ మండలం కణుపూరు మీదుగా జంబూపట్నం, అయ్యనగళ్ల సమీపంలోని రోమ్‌సిటీ మీదుగా తరలిస్తున్నారు. అలాగే మల్లిసాల,



సిగరెట్ మాదిరిగా పేపర్‌లో చుట్టిన గంజాయి

కణుపూరు, నర్సాపురం నుంచి వయా దోసకాయలపల్లి, రాజానగరం జాతీయ రహదారి గుండా తరలింపు జరుగుతోంది. రాజమహేంద్రవరం నుంచి కొందరు విద్యార్థులు పిక్నిక్ కోసం ఏజెన్సీ ప్రాంతాలకు వెళుతున్నారు. వచ్చేటప్పుడు బ్యాగుల్లో గంజాయిని తీసుకువస్తున్నారు. ఇక్కడి నుంచి రైలు, రోడ్డు మార్గాల ద్వారా సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గతంలో గుంటూరు ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ఇలాగే బ్యాగుల్లో గంజాయిని తరలిస్తూ పోలీసులకు చిక్కారు.

కోరుకొండ సర్కిల్ పరిధిలో..

కోరుకొండ సర్కిల్‌పరిధిలో పలు గంజాయికేసులు నమోదయ్యాయి. గత ఐదేళ్లలో సుమారు 1500 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 17వ తేదీన ఐదుగురు యువకులు 1.700 కేజీల గంజాయితో పోలీసులకు చిక్కారు. వీరంతా రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, శ్రీరాంపురం తదితరగ్రామాలకు చెందిన వారే కావడం విశేషం. వీరంతా గంజాయిని చిన్నపొట్లాలుగా తయారు చేసుకుంటుండగా పోలీసులు పట్టుకున్నారు.

నియంత్రణకు చర్యలు



గంజాయి రవాణా, వినియోగాన్ని నిర్వీర్యం చేయడానికి ఈగల్, నార్కోటిక్ టీమ్‌లను ఏర్పాటు చేశాం. గట్టి చర్యల ద్వారా గంజాయి రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు కృషి చేస్తున్నాం. ముందస్తు చర్యల్లో భాగంగా విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలను యువతకు తెలియజేస్తున్నాం.

– వై.సత్య కిషోర్, సీఐ, కోరుకొండ

అనేక అనర్థాలు



గంజాయిని వినియోగించడం ద్వారా యువత భవిష్యత్తు నిర్వీర్యం అవుతోంది. రెగ్యులర్‌గా గంజాయిని వాడటంతో మెదడు సమస్యలు ఉత్పన్నమవుతాయి. నరాల సంబంధిత వ్యాధులు సోకుతాయి. యువత మానసిక ప్రశాంతతను కోల్పోతారు. నిరాశ, నిస్పృహలతో ఉంటారు. గంజాయికి బానిసలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ జ్ఞానచంద్ర, పీహెచ్‌సీ, కోరుకొండ

యథేచ్ఛగా రవాణా



కూటమి ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టకపోవడంతో గంజాయి రవాణా యథేచ్ఛగా సాగుతోంది. విశాఖ ఏజెన్సీ, ఒడిశా నుంచి దేశంలోని అనేక ప్రాంతాలకు రవాణా అవుతోంది. ప్రభుత్వంలోని పెద్దల అండదండలతోనే గంజాయి రవాణా జరుగుతోంది.

– అడపా కనకరాజు, కన్వీనర్, వైఎస్సార్ సీపీ, కోరుకొండ

ధ్రువపత్రాల జారీపై అవగాహన



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

కంబాలచెరువు: జనన, మరణ, పెళ్లి, ఆదాయ ధ్రువ పత్రాల జారీపై బుధవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని కోర్టు హాలులో మునిసిపల్, సచివాలయ సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి మాట్లాడుతూ వివిధ ధ్రువ పత్రాలను సకాలంలో పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి ఆవశ్యకతను వివరించారు. సబ్ రిజిస్ట్రార్ ఆర్.రాంబాబు మాట్లాడుతూ ప్రస్తుతం పెళ్లి ధ్రువ పత్రం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ గాయత్రీ దేవి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ సేవలను అందరూ ఉపయోగించుకోవాలన్నారు. డీఎల్ఎస్ఏ ప్యానెల్ న్యాయవాది డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డీఎల్ఎస్ఏ ద్వారా పేదలందరూ న్యాయసేవలను ఉచితంగా పొందవచ్చన్నారు.

విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రకాశం నగర్: సీపీఐ ఎంఎల్ , న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ ఈ నెల 23న విజయవాడ మాకినేని భవనలో జరగనుంది. ఈ మేరకు ఆర్యాపురం ఆడితి సెంటర్‌లో బుధవారం ఆ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి జోజీ మాట్లాడుతూ నిర్మాణ సమస్యల కారణంగా రెండుగా చీలిపోయిన పార్టీలు తిరిగి ఐక్యమవుతున్నాయని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారం, ధరల భారం మోపిందన్నారు. అదానీ, అంబానీలకు రాయితీలు కల్పిస్తోందని విమర్శించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కడియం: కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ తరఫున కడియపులంకలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి బుధవారం ప్రచారం చేశారు. ఆయన వెంట ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, కూటమి పార్టీల నాయకులు ఉన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని బీజేపీ జిల్లా పూర్వ అధ్యక్షులు బొమ్ముల దత్తు , రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి విజ్ఞప్తి చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు నందివాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో 41వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

రాజానగరం: హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 2వ అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.ప్రకాష్ బాబు తీర్పునిచ్చారు. 2021లో నమోదైన ఈ కేసు వివరాలను సీఐ వీరయ్య గౌడ్ బుధవారం వెల్లడించారు. నందరాడకు చెందిన చప్పిడి శివకాశిపై దువ్వాటి శామ్యూల్ చాకుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదుపై అప్పటి ఎస్సై నాగబాబు కేసు నమోదు, నిందితుడిని అరెస్టు చేశారు. విచారణలో అతనిపై మోపబడిన అభియోగం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పీపీ పీవీవీ ఎస్‌బీ రాజు వాదించారు.

సినిమాలు



శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్య మినీ	: కెప్టెన్ అమెరికా
సూర్య ప్యాలెస్	: చావా
స్వామి	: బ్రహ్మ ఆనందం
శివజ్యోతి	: తండేల్
అనుశ్రీ	: లైలా
రాజా	: సంక్రాంతికి వస్తున్నాం
ఊర్వశి	: కాంప్లికేటెడ్
మేనక	: నిదిరించు జహాపన, తల
రంభ	: ఆరెంజ్
కుమారి	: కెప్టెన్ అమెరికా
అప్సర	: తండేల్
అశోక	: లైలా
నామవరం	
వీఎస్ మహల్	: తండేల్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: తండేల్
కడియం	
వెంకటసూర్య	: లైలా